# గుల్ల నీరు

రాత్రి ఎనిమిదింటికి రావలసిన తెనాలి బండి గుంటూరు చేరుకునేసరికి పది దాటింది. చినుకులు మొదలయి అలానే పడుతున్నాయి. చిక్కబడడం లేదు. ఆగడం లేదు. గాలి చల్లగా వీస్తోంది. దామోదరం బండి దిగి స్టేషను బయటకు వచ్చాడు. ఎప్పటిలా ప్రయాణీకుల చుట్టూ చేరే రిక్షావాళ్ళు ప్రయాణీకులు అట్టే లేకపోవడం వలన పలచగా ఉన్నారు.

అయిదు నిమిషాలు చినుకులకు అందకుండా గోడకు ఆనుకుని నిలబడిన తర్వాత, "ఎక్కడికి ఎళ్ళాలి సారూ?" సైకిలు రిక్షా అతను అడిగాడు. తను వెళ్ళాల్సినంత దూరం రిక్షా అతను వస్తాడని దామోదరానికి అనిపించలేదు. 'ఆటో దొరికితే బావుండు' అనుకున్నాడు.

"బృందావన్ గార్డెన్స్" అన్నాడు.

"అరవయి రూపాయలవుద్ది".

దామోదరం తల అడ్డంగా ఆడించాడు.

"అయిదు తగ్గించుకోండి."

దామోదరం ఏం మాట్లాడలేదు.

"శానా దూరం సారూ. వర్షం పడుతోంది." అని దామోదరం చూపులు మరలించుకునేసరికి రిక్షా అతను మెయిన్‌గేటు వయిపు వెళ్ళిపోయాడు.

కొన్ని సంవత్సరాల కిందట దామోదరం గుంటూరు గుండారావు పేటలో టింబరుడిపో పక్కన ఉన్న ఇంట్లో చిన్నప్పటినుండి ఉన్నాడు. అతని పెళ్ళి ఆ ఇంట్లోనే జరిగింది. ఇద్దరు పిల్లలు అక్కడే పుట్టారు. రెండు అంతస్తుల ఇల్లు. చుట్టూ ఉన్న కొబ్బరి చెట్ల మధ్య ఎంతో దర్జాగా ఉండేది. ప్రహరీగోడకూ ఇంటికి మధ్య ఖాళీ లేకుండా పూల మొక్కలుండేవి. ఎక్కడెక్కడనుండో పూల మొక్కలు తెచ్చి తన తమ్ముడు కాంతారావు ఎంతో శ్రద్ధగా చూసుకునేవాడు.

ఇప్పుడేమీ లేవు. ఇల్లు పాడుబడిపోయింది. ప్రహరీ గోడలు విరిగి పడిపోయాయి. చెక్కతలుపులు, కిటికీలు ఎవరో తీసుకు వెళ్ళిపోయారు. ఆలనాపాలనా లేక కొబ్బరిచెట్లు

మొదళ్ళు మటుకు మిగిలాయి. ఒకానొక సమయంలో ఆ చుట్టుపక్కల్లో అంత మంచి ఇల్లు ఉండేదంటే నమ్మరు. అతనికి జ్ఞాపకాలు మటుకు మిగిలాయి.

దామోదరం తెనాలిలో బయల్దేరి నప్పుడు అతని భార్య సత్యవతి గొడుగు తీసుకువెళ్ళమని తెచ్చి ఇచ్చింది. అప్పటికి వర్షం వచ్చే సూచనలు అవుపించలేదు. వద్దనలేదు. తీసుకున్నాడు. ఇష్టం లేకపోయినా ఆమె మాట కాదనడు. ఆమె మాటలు శాసిస్తున్నట్టుగా ఏం ఉండవు. పుల్ల విరిచినట్టుగానూ ఉండవు. మాట మటుకు నెగ్గించుకుంటుంది.

రైలు స్టేషనుకు వచ్చి బండిలో కూర్చున్న తర్వాతగాని గొడుగు సంగతి గుర్తు రాలేదు. వస్తూ ఇంట్లోనే ఎక్కడో పెట్టి మర్చిపోయాడో, ఎక్కి వచ్చిన రిక్షాలో మర్చిపోయాడో తట్టడం లేదు. వర్షాకాలంలో కనీసం రెండు గొడుగులయినా పోగొట్టుకుంటాడు. జీవితంలో దేన్నయినా తేలికగా తీసుకుంటాడు, నీళ్ళను తప్ప! నీళ్లను భరించడానికి భయం వేస్తుంటుంది. నీళ్ళను తప్పించుకోడానికే మకాం గుంటూరు నుండి తెనాలి చాలాకాలం కిందట మార్చాడు. అక్కడా ఏం కలిసిరాలేదు. పిల్లలు పెద్దవాళ్ళవు తున్నారు. ప్రతిదానికి తడువుకోవలసి వస్తోంది.

బండిసమయానికి గుంటూరు చేరుకుని ఉంటే సిటీబస్సుదొరికి ఉండేది. అయిదు రూపాయల్లో బృందావన్‌గార్డెన్స్ చేరుకునేవాడు. తను వెళ్ళాల్సింది దగ్గరయి ఉంటే నడుచుకుంటూ వెళ్ళి ఉండేవాడు. ఆటోస్టాండుకు వచ్చి నలుగురయిదుగురు ఆటోవాళ్లను అడిగాడు. బృందావన్‌గార్డెన్స్ రావడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. ఎలా అయినా ఈ రాత్రికి రాఘవ అపార్టుమెంట్సులో ఉంటున్న ప్రసన్నబాబును కలుసుకోవాలి. మరుసటిరోజు ఉదయం అయిదింటికి బయల్దేరి అతను చెన్నయ్ వెళ్ళిపోతున్నాడు. తిరిగి రావడానికి పదిహేను రోజులు కన్నా ఎక్కువే పట్టవచ్చు. గుండారావుపేటలోని తన ఇల్లు అతను కొనుకునేట్టు ఉన్నాడు. మూడునెలల నుండి బేరం నలుగుతోంది. అతను తక్కువకు అడుగుతున్నాడు. ఎంతో కొంతకు అమ్మేయడానికి మనస్కరించడం లేదు. కాయితం రాయించుకుని అడ్వాన్సు ఇవ్వడానికి ప్రసన్న బాబు సిద్ధంగా ఉన్నాడు.

చివరిప్రయత్నంగా ఆటోస్టాండు గోడ పక్కగా ఉన్న ఆటో దగ్గరకు వచ్చి లోపలికి తొంగి చూశాడు. ఆటో అతను వెనక సీట్లో తువ్వాలు కప్పుకుని పడుకుని ఉన్నాడు. పలచటి వెలుతురులో అతను మెలకువగా ఉన్నాడో, నిద్రపోతున్నాడో తెలియడం లేదు. నిద్రపోతున్న వాళ్ళను మేల్కొలిపితే విసుక్కుంటారు.

పావు నిమిషంపాటు ఆటో పక్కనే నుంచుని విసుక్కుంటే విసుక్కున్నాడనుకొని, "ఆటో, ఆటో" పిలిచాడు.

ఆటో అతను లేచి కూర్చున్నాడు.

"బృందావన్ గార్డెన్స్ వెళ్ళాలి, వస్తావా?"

ఆటో అతను ఆటో దిగి ఎర్రటి తువ్వాలు తలకు చుట్టుకుని, "ఎక్కండి" అన్నాడు.

దామోదరానికి సంతోషం వేసింది. "ఎంతివ్వమంటావు?" అడిగాడు.

"నలబయి రూపాయలివ్వండి."

"ముప్పయి ఇస్తాను." చాలా విషయాల్లో నష్టపోయిన దామోదరం చిన్నాచితక విషయాల్లో బేరాలు ఆడుతుంటాడు. నిజానికి ఆ సమయంలో అంతదూరం అంత తక్కువకు ఎవరూ రారు.

"ఎక్కండి."

దామోదరం ఆటోలో కూర్చున్నాక ఆటో కదిలింది. వయిపర్స్ కదులుతోంటే అద్దానికి ఒరుసుకుంటూ శబ్దమవుతోంది. రిక్షారోడ్డు మీదకు వచ్చింది. చినుకులు అలానే పడుతున్నాయి. విసుగు అనిపిస్తోంది. 'నువ్వూ అటు పక్కే ఉంటావా?' అని రిక్షా అతన్ని అడుగుదామనిపించింది. మాట నోటి చివరికంటా వచ్చింది. అడగలేదు. గాలి విసురందుకుంది. చినుకులు ఆటోలో పడుతున్నాయి. మూలకు జరిగి కూర్చున్నాడు.

నీళ్ళంటే ఏవగింపు మొదలయి చాలా సంవత్సరాలయింది. నగరం పాలెంలో వాణి బేరక్సు ఎదురుగా తండ్రి ఇల్లు కట్టినప్పుడు నీళ్ళకయి ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండడానికి అతని తండ్రి బావి తవ్వించాడు. చాలా లోతుగా వెళ్ళినా ఎంచాతనో నీళ్ల పడలేదు. మరో అయిదు అడుగులు తవ్వితే నీళ్ళు తప్పకుండా పడతాయని ఎవరో సూచించినా తవ్వించే ప్రయత్నం చేయలేదు. అప్పటికే ఖర్చు చాలా అయింది. లాభం లేదనుకుని చేతులు ఎత్తేసిన మూడునెలల తర్వాత బావిలో నీళ్ల పడడం మొదలయింది. పడిన మంచినీళ్ళు కొబ్బరి నీళ్ళంత రుచిగా ఉండేవి. అసలా ఆ చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళకు ఎవరికీ మంచినీళ్ళు పడలేదు. పడిన నీళ్ళు వగరుగా ఉండేవి. ఆ ఇంట్లో మంచినీళ్ళు పడినందుకు ఇంటిల్లిపాదీ సంతోషం అంతా ఇంతాకాదు. 'ఇల్లు కట్టిన విశేషం' అన్నారు చాలామంది. 'అదృష్టం అంటే వాళ్లది' అనుకున్న వాళ్ళూ ఉన్నారు.

బావి చుట్టూ గట్టు కట్టిన పదిహేను రోజులకు నీళ్ళు బావి అంచు వరకు వచ్చాయి. చప్టా మీద నిలబడి చేయి పెడితే నీళ్ళు అందేవి. ఇళ్ళు కళకళలాడడం మొదలయింది. రెండు సంవత్సరాలకు పయిగా వెలిగిన అదృష్టం తప్పుకుంది. తండ్రికి ఎందుకో సుస్తి చేసింది. నాలుగో రోజుకు తగ్గిపోయింది. అయిదో రోజున ఆయన చనిపోయాడు. రెండు నెలలు తిరగకుండా తల్లికి పక్షవాతం వచ్చింది.

సత్యవతి తల్లిని చూసేది కాదు. కనీసం దగ్గరకు వెళ్ళడానికి కూడా ఇష్టపడేది కాదు. అన్నీ మంచం మీదే జరిగేవి. ఒక పక్క కాలేజీకి వెళ్తూ మరోపక్క తల్లికి ఏం తక్కువ కాకుండా కాంతారావే చూసుకుంటూ ఇంటి చాకిరంతా చేసేవాడు. తల్లి అయిదు నెలలకంటే ఎక్కువ బతకలేదు.

తల్లి చనిపోయాక బావిలో నీళ్ళు నిండి పొంగి పొర్లి పోతుండేవి. కట్టకట్టి నీళ్ళు బయటకు మళ్ళించే ప్రయత్నం చేసినా బావి అన్ని దిక్కుల నుండి ఎక్కువగా రావడంతో ఏం లాభంలేకపోయింది. ఇంటిచుట్టూ మడుగు ఏర్పడి ఇంట్లోకి రావడానికి, ఇంట్లోంచి బయటకు వెళ్ళడానికి చాలా ఇబ్బంది అవుతుండేది. అంతేకాకుండా నీళ్ళు కింద గదుల్లోకి రెండు మూడు గంటలపాటు వచ్చి ఇంటిని ఆగమాగం చేసి ఆగిపోయేవి. ఇవేళ వచ్చిన సమయానికి రేపు వచ్చేవి కావు. ఏరోజుకారోజు సమయం మారుతూ ఉండేది. బావుల గురించి బాగా తెలిసినవాళ్ళను తీసుకు వచ్చి చూపించాడు. అలా జరగడానికి ఎవరూ ఏ కారణం చెప్పలేకపోయారు. దామోదరానికి ఏం చేయాలో అర్థం కాలేదు.

డిగ్రీ ఫలితాలు వచ్చాయి. పయి చదువులకు కాంతారావును పంపించడానికి దామోదరం ఎటు వంటి ఆసక్తి చూపించలేదు. రెండు సంవత్సరాల పాటు ఉద్యోగవేటలో పడ్డాడు. ఉద్యోగాలు చేతివరకు వచ్చి జారిపోయేవి. నాలుగయిదు సార్లు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇంటికి వచ్చాయి. కాని కాంతారావు చేతికి అందలేదు. సత్యవతి దగ్గర ఆగిపోయేవి. అతనికి ఉద్యోగం దొరికి ఇంట్లోంచి వెళ్ళిపోతే ఇంటిచాకిరి ఎవరు చేస్తారు? పిల్లల్ని ఉదయం స్కూల్లో వదిలిపెట్టి సాయంత్రం ఇంటికి ఎవరు తీసుకువస్తారు? ఎన్నెన్ని చేసేవాడు? ఒక్కటనా? వాడితో ఒకరోజు పోట్లాట పెట్టుకుని అన్ని సర్టిఫికెట్లు కాల్చి వేస్తున్నప్పుడు దామోదరం అక్కడే ఉండి, 'ఏం పనిది?' అరుస్తూ ఆర్పే ప్రయత్నం చేసే లోపల అన్నీ కాలిపోయాయి, వాడూ అక్కడే ఉన్నా గుడ్లనిండా నీళ్ళు కక్కుకుంటూ చూస్తూ ఉండిపోయాడు కాని నోరు విప్పి ఒక్క మాటయినా మాట్లాడలేదు. వాడు కుళ్ళి కుళ్ళి ఏడవడం అంతకుముందు ఎప్పుడూ

చూడలేదు. ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఆ సంఘటన జరిగి ఎన్నో సంవత్సరాలు గడిచినా నిన్నో మొన్నో జరిగినట్లు అనిపిస్తుంటుంది.

తెనాలిలో స్థిరపడ్డాక ఎప్పుడు గుంటూరు వచ్చినా గుండారావుపేటలోని ఇల్లు చూసి వస్తుంటాడు దామోదరం. ఎండకు ఎండి వానకు తడిచి ఇల్లు మరింత పాడు బడిపోయింది. ఊరంతా బాగుపడింది కాని గుండారావు పేట తన చిన్నప్పుడు ఎలా ఉందో అలానే ఉంది. ఏం మారలేదు. ఇప్పుడు బావిలోంచి నీళ్ళు రావడం లేదు. ఇల్లు అమ్మేయడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కొంటామని ఒప్పుకుని తప్పుకున్నవాళ్ళూ ఉన్నారు. అన్నీ తెలిసి కొనడానికి ప్రసన్నబాబు ముందుకు వచ్చాడు. ఈ అవకాశాన్ని జారవిడుచుకోవాలనిపించడం లేదు.

బృందావన్ గార్డెన్స్ రాగానే, "కుడి పక్కన ఆపేయి" అన్నాడు దామోదరం.

రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద ఆటో ఆగింది. వీధి దీపపు వెలుతురు చెట్టుకు అవతలే నిలబడి పోయింది. వీధి నిర్మానుష్యంగా ఉంది. దామోదరం ఆటో దిగి జేబులోంచి డబ్బులు బయటకు తీశాడు. చినుకులు పడుతూనే ఉన్నాయి.

ఆటో అతను బండిని వెనుకకు తిప్పుకుని స్టార్ట్‌చేశాడు. ఆటోముందుకు కదిలింది, "ఇదిగో ... ఆటో.... డబ్బులయ్యా.." అంటున్నాడు దామోదరం. నోరులేని ఆటో ఆగలేదు. ఎప్పుడో ఇల్లు వదిలి వెళ్ళిపోయిన కాంతారావు ఆటోను ఆపలేదు.

* నవ్య వీక్లీ, 27 ఏప్రిల్ 2011

(ఈ కథ కల్పితం కాదు. నేనూ లక్ష్మీకాంతరావు కలిసి బీ.యస్.సి. చదువుకున్నాం. నేను ఉద్యోగరీత్యా చాలా దూరం వెళ్ళిపోయాను. తర్వాత నాకు తెలిసింది ఏమిటంటే ఇంట్లోంచి బయటకు వెళ్ళగొట్టబడిన కాంతారావుకు ఏ ఉద్యోగం దొరకలేదు. గుంటూరు రైల్వేస్టేషన్ బయట ఉండే చెత్తకుండీ పక్కన మాసిపోయిన గుడ్డలతో పిచ్చివాడిలా ఉంటూ ఆకలితో ప్రాణం నిలబెట్టుకోలేకపోయాడు. మూడు రోజుల తర్వాత శవాన్ని మునిసిపాలిటీ వాళ్ళు తీసుకెళ్ళిపోయారు. కథ అలా చిత్రించడం నాకు ఇష్టం కాలేదు. ఎన్ని కష్టాల్లో అయినా నోరు మెదపకుండా నవ్వుతూ ఉండే నా మంచి కాంతారావు స్మృతికి ఈ కథ అంకితం. మీకు ఎప్పుడయినా పిచ్చివాడు కనిపించి చేయి చాపితే కోపగించుకోకండి. అసహ్యించుకోకండి, ఏమీ దానం చేయకపోయినా, అతనూ ఒక కాంతారావు లాటివాడే అయి ఉండొచ్చు)